యతి ప్రాసలు' తెలుగు భాషకు స్వయం ప్రతి పత్తిని, విశిష్టతను కలిగించాయి తెలుగు భాషకు యతిప్రాసలు అపరిమిత శోభను చేకూర్చాయనడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. తెలుగు భాషేతరులు సైతం తెలుగు భాషకు యతిప్రాసలు అమూల్యాభరణాలని కొనియాడారు.

ఒక భావాన్ని ఒక పద్యరూపంలోగాని లేక వచన రూపంలోగాని వ్యక్తము చేసేటప్పుడు పఠిత, శ్రోత, వక్తలు శ్వాస తీసుకోవడానికి, ఇంద్రియాలకు విశ్రాంతిని కల్పించడానికి మధ్య మధ్య వ్యవధానము అవసరం. అందుకనే పద్యంలో పాదముల విభజన, వచనంలో అర్ధ, పూర్ణ..) విరామ చిహ్నాలు ఏర్పడ్డాయి. కొన్ని పద్య పాదాల్లో వర్ణాల సంఖ్య ఎక్కువగా ఉండటం చేత పాద మధ్యంలో వ్యవధానం ఆవశ్యకమవుతుంది. చిన్ని పాదాలు గల పద్యాల్లో ఈ వ్యవధానం ప్రతి పాదానికి అవసరం లేదు. కాబట్టే అటువంటి పద్యాల్లో (కందాది పద్యాలు) రెండు, నాలుగు పాదాల్లో మాత్రమే వ్యవధానం (యతి) ఏర్పడుతుంది ఈ వ్యవధానాంతరం అసంపూర్ణమైన ఆ పాదం పున: ప్రారంభమైనప్పుడు పాదారంభ వర్ణాన్నే మరలా ఆ స్థానమందు ఉంచడం తెలుగు భాషలో సంతరించు కుంది. ఇట్టి విధానం కాల క్రమంలో మార్పు చెంది ఆ వర్ణానికి సన్నిహితోచ్చారణ కలిగిన సజాతీయ వర్ణాలను వాడటం జరిగింది. ఈ విధానం పద్యాల్లోనే కాక సామెతల్లో, గేయ వాఙ్మయంలో ప్రాచీన కాలం నుండే కనిపిస్తోంది. కాబట్టి ఈ వర్ణమైత్రి దేశీయఛందస్సుకి సంబంధించింది.

యతిప్రాసల కూర్పుకి 'లయ' ప్రాధాన్యం వహిస్తుంది. లయోత్పత్తికి కారణం స్థాన, కరణ, ప్రయత్నాదుల సామ్యం. లయ శ్రవణానందాన్ని కలిగిస్తుంది.లయాత్మకమైన పద్యం వినగానే అర్థం స్పష్టంగా తెలియకపోయినా పామరులు సైతం తల ఊపడం అందులోని లయ వారి మనస్సులను రంజింప చేయడమే. సామెతలు, గేయ వాఙ్మయమందు ఈ వర్ణమైత్రి ఒక నియమితాక్షరానికనే నియమం ఉండదు. కానీ పద్యాలందు మాత్రం ఒక నియమితాక్షరానికే ఈ యతిమైత్రి పాటింపబడింది. దానికి కారణం తెలుగు భాషలోని పలు ప్రాచీన రచనలకు మూలం సంస్కృత రచనలు. సంస్కృత భాషలోని ఇతివృత్తాలతో పాటు పద్య నడకలనూ కూడా గ్రహించడం జరిగింది. గణ నియమం తో పాటు సంస్కృత భాషలోని 'విచ్ఛేదనము' (యతి) స్థానంలో దేశియ వర్ణమైత్రి విధానాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది.

<u>ఈ విషయాన్ని అనంతుడు కూడా స్పష్ట పరచాడు.</u>

ఎన్నిట యతి రావలెనని
రన్నిట సంస్కృతంబునగు విచ్ఛేదం
బెన్నిట యతి రావలెనని
రన్నిట దెలుగునకు మొదలి యక్షర మమరన్ —ఛందోదర్పణము(1-129)

యతి స్థానమందు ఈ వర్ణమైత్రి అనే వళిని వాడడం చేత అర్థంలో మార్పు ఉన్నప్పటికి ఈ యతి, వళి అనే శబ్దాలు పర్యాయపదాలుగాలి రూపొందాయి.యతిప్రాసలకు సంబంధించి ఎన్నో లక్షణ గ్రంధాలు రచింపబడ్డాయి. కాని వాటిలో యతిప్రాసలకు గూర్చి ఎంతో విపులంగా, సరళంగా సోదాహరణ పూర్వకంగా అప్పకవీయంలో మాత్రమే చెప్పబడింది. దానికి రావూరి దొరస్వామి గారి వ్యాఖ్యానం మరింత వన్నె తెచ్చింది. ప్రతి విద్యార్థి చదివి తమ విజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవడానికి 'అప్ప కవీయానికి' మించిన ఛందో గ్రంథం మరోకటి లేదు పూర్వ కవుల గ్రంథాలలోని అనేక పద్యాలతో పాటు స్వయంగా కొన్ని

లక్ష్యాలను చూపాడు అందుకే అప్పకవి

ఇది చదివిన పిమ్మట మఱి
యెదియేనియు ( జదువు బుద్ధి యేలా వొడమున్
బదపడి గ్రంథములన్నియు
వెదకి వెదకి సారమెల్ల వివరింపగన్

– 'అప్పకవీయం 1-7'

వాటిలో ప్రథమ లక్షణ గ్రంథంగా భావింపబడే మేలవాడ భీమ కవి విరచిత "కవిజనాశ్రయం" లో 10 యతులు 6 ప్రాసలు పేర్కొనెను. అనంతుడు తన ఛందో దర్పణంలో 24 యతులను 12 ప్రాసలను చెప్పెను. ఇవి నానాటికి మహా వృక్షంలాగా పెరిగి అప్పకవి కాలం నాటికి 41 యతులు, 17 ప్రాసలుగా చేరుకున్నాయి. అప్పకవి తన యతులను నాలుగు విభాగాలుగా చేశాడు. అవి

1. స్వర యతులు
2. వ్యంజన యతులు
3. ఉభయవళులు
4. ప్రాస యతులు

స్వరయతి: ఏ ఏ అచ్చులకు మధ్య యతి చెల్లునో వివరించబడింది.
వ్యంజన యతి: వ్యంజనాలంటే హల్లులు. ఏ ఏ హల్లులకు మధ్య యతి చెల్లునో వివరించ బడింది.
ఉభయ వళులు: నిత్య సంధులు, నిత్య సమాసాల్లో పరపదంలోని అచ్చుకు గాని, సంధి వశంలో ఉన్న హల్లుకు గాని యతి చేయుట వివరించబడింది. అంటే అచ్చు, హల్లు అనే ఉభయాల్లో దేనికైనా యతి చెల్లుతుంది.
ప్రాస యతులు: సీస, గీత పద్యాలందు యతి మారుగా ప్రాసాక్షరానికి యతి మైత్రిని పాటించుట

---

లివిరతి, విశ్రాంతి, విశ్రామ, విశ్రమములు
శ్రాంతి, విరమణ విరమ, విరామ యతులు
ననగ నివి తొమ్మిదియు వళి కాఖ్యలయ్యె
భవ్యసక్తు ఫలాయామ్య భాగగేహ !

– అప్పకవీయం (1-6)

స్వర యతుల పట్టిక:

| భీమ కవి | అనంతుడు | అప్ప కవి |
|---|---|---|
| స్వర యతి | స్వర యతి<br>గూఢ స్వర యతి<br>ఋకార స్వర యతి<br>ఱీ విరమము<br>కారయతి ఇ | స్వర మైత్రి వళి<br>స్వర ప్రధాన వళి<br>లుప్త విసర్గక స్వర వళి<br>ఋవళి<br>ఋత్వ సంబంధ వళి<br>ఋత్వ స్వామ్య వళి<br>వృద్ధి వళి |

పూర్వ కవుల లక్ష్యములననుసరించే లక్షణ గ్రంధాలు వెలిశాయి.కవిజనాశ్రయకర్త కాలానికి ముందు వెలసిన గ్రంధాలు తక్కువ కావడంతో అతడు చెప్పిన యతులు సంఖ్య కూడా తక్కువే. కాబట్టే భీమన స్వర యతి మాత్రమే చెప్పగా అనంతుడు స్వరాలకు సంబంధించి ఐదు యతులను, అప్పకవి ఏడు యతులను చెప్పడం జరిగింది.

*<u>స్వర యతులు వాటి మైత్రి</u>*

| | యతి పేరు | యతి మైత్రిని పొందే అక్షరాలు |
|---|---|---|
| 1 | స్వరమైత్రి వళి | అ ఆ ఐ ఔ<br>ఇ ఈ ఋ ౠ ఎ ఏ<br>ఉ ఊ ఒ ఓ |
| 2 | స్వర ప్రధాన వళి | అచ్సంధి పదాలలో పరపదంలోని తొలి అచ్చుకి యతిమైత్రి కూర్చుట. |
| 3 | లుప్త విసర్గక స్వర వళి | అకారంమీది విసర్గకు అకారం పరమైతే 'ఓ'కారం ఆదేశంగా వస్తుంది.<br>అలా ఆదేశంగా వచ్చిన 'ఓ' కారానికి 'అయహ' అనే వాటితో యతి చెల్లుట |
| 4 | ఋ వళి | ఋ కి హల్లుతో కూడిన వట్రు సుడి ( ృ ) తో పాటు, రిరీరెరే లతో యతిమైత్రి ఏర్పడుట |

| | | |
|---|---|---|
| 5 | ఋత్వ సంబంధ వళి | వ(ట్రుసుడి ( ృ ) కి - ఇఈఎఏఋఋూయియీయెయేయృయౄ : హిహీ హెహేహృహౄ లతో మైౖత్రిని పొందుట. |
| 6 | ఋత్వ సామ్య వళి | హల్లుల మైౖత్రితో సంబంధం లేకుండా కేవలం ృ - ృ యతిమైౖత్రిని పాటించుట. |
| 7 | వృద్ధి వళి | వృద్ధి సంధి జరిగినపుడు పరస్వరాలైన ఏ, ఓ లకు గాని, ఆదేశస్వరాలైన ఐ ఔ లకు గాని యతి చెల్లుట |

భీమన 'స్వరయతి' యందు సంధివశమున కూడిన పదాలందు పరపదాది అచ్చుకే యతి పాటించాలనే నియమాన్ని గ్రహించి అప్ప కవి 'స్వర ప్రధాన వళి' ని ప్రత్యేక యతిగా చెప్పాడు. అనంతుడు కూడా ఈ నియమాన్ని చెప్పాడు కాని, ఒక యతి భేదంగా మాత్రం చెప్పలేదు. అప్పకవి 'స్వర ప్రధాన వళి' ని అధనంగా చెప్పడానికి కారణం సంధి వశమున కూడిన పదాలలో స్వరానికి ప్రాధాన్యం ఇవ్వాలని వ్యంజనానికి యతి వేయరాదని స్పష్టపరచడానికే. అలా ప్రత్యేకంగా చెప్పకపోతే ఇది ఉభయ వళుల క్రింద చేరే అవకాశం ఉంది. దాన్ని నివారించడానికే అప్పకవి ఇలా చెప్పాడనవచ్చు అనంతుడు 'ఋ కార స్వరూప యతి' లో వట్రు సుడి(ృ) కి ఇ--ఈ--ఎ--ఏ--ఋ--ఋూ అను అచ్చులకు, వాటితో చేరిన 'య--హ' లకు యతిమైత్రి చెల్లునని హల్మైత్రి లేకయే, వట్రువుకు యతిమైత్రి చెల్లునని చెప్పగా అప్పకవి 'వట్రుమైత్రి' ని 'ఋత్వ సామ్యవళి' అని ప్రత్యేకమైన యతిబేధంగా చెప్పెను. 'ఋ' కారానికి స్వర వ్యంజన ధర్మాలు రెండూ వర్తిస్తాయి. వ్యంజనంతో చేరే ఋ కారానికి వ్యంజన గుణముండుటచేత అది సంయుక్తమవుతుంది. సంయుక్తాక్షరాలందు ఒక వర్ణానికి యతిమైత్రి చెల్లిస్తే చాలు అనే నియమాన్ని అనుసరించి ఈ యతిమైత్రి పాటింపబడింది. కాబట్టే అప్పకవి ప్రత్యేకంగా ఈ యతినే చెప్పడం జరిగింది. కాని 'ఋత్వ సంబంధ వళి' ని ఋత్వసామ్యవళిని వేరు వేరు యతులుగా చెప్పడం అనవసరం. అనంతుడు 'రిరీరెరే' లకు 'ఋ' కారంతో యతి చెందడం చేత ఈ యతి మైత్రిని 'రీ విరమము' అని పేర్కొనెను. కాని 'ఋ' కారానికి చెప్పబడే యతి కాబట్టి (యతి ఏ వర్ణానికి చెప్పబడుతుందో దాన్నే గ్రహించడం సమంజసం) 'ఋ'వళి అని అప్పకవి పేరు మార్చి చెప్పెను కాని పేరులో మార్పే తప్ప లక్షణం ఒక్కటే. అనంతుని 'గూఢ స్వర యతి' లక్షణంలో 'లుప్త విసర్గ' అను పదాన్ని గ్రహించి లుప్తమైన (లోపించిన) స్వరానికి చెప్పే యతి కాబట్టి 'లుప్త విసర్గక స్వరవళి' అని పేర్కొన్నాడు. అనంతుడు, అప్పకవి పేర్కొన్న ఈ యతికి పేర్లలో తేడానే కాని లక్షణం ఒక్కటే. అప్పకవి వృద్ధి వళి ని అదనంగా చెప్పాడు. అనంతునికి, అప్పకవికి మధ్య కాలపువాడైన చిత్ర కవి పెద్దన కూడా ఈ యతి మైత్రిని పేర్కొన్నాడు. అప్పకవి 'స్వర ప్రధాన వడి' యందు పరస్వరానికి మాత్రమే యతి చెల్లింప వచ్చునని చెప్పాడు. కాని వృద్ధి వళిలో పర స్వరానికి గాని ఆదేశ స్వరానికి గాని యతి చెల్లింపవచ్చని చెప్పాడు. ఈ యతి అవసరమే. అనంతుడికి పూర్వం కొందరు కవులు ఈ యతి మైత్రిని పాటించినప్పటికి, స్వయంగా అతడే పాటించినాగాని ఎందుకో ఈ యతి బేదాన్ని మాత్రం చెప్పలేదు.

'ఌ' కారయతి – అనంతుడు చెప్పిన 'ఌ' కారయతిని అప్ప కవి చెప్పలేదు. దానికి కారణం 'ఌ' కారముతో యతిమైత్రి పాటించిన లక్ష్యములు అరుదగుట, అప్పకవి కాలం నాటికి 'ఌ' కారం భాషలో పూర్తిగా నశించడంగావచ్చు.

<u>వ్యంజనయతుల పట్టిక:</u>

| భీమన | అనంతుడు | అప్ప కవి |
|---|---|---|

| | | |
|---|---|---|
| వర్గ వళి<br>బిందు వళి<br>సంయుక్తాక్షర వడి<br>ఎక్కటి వడి<br>పోలిక వడి<br>సరస వళి<br>ప్రాది యతి<br>ప్లుత వడి<br>అఖండ వడి | వర్గ యతి<br>అనుస్వార యతి<br>తద్భాత వ్యాజ యతి<br>పోలిక యతి<br>మకార యతి<br>భిన్న యతి<br>ఎక్కటి యతి<br>అభేద యతి<br>సరస యతి<br>సంయుక్త యతి<br>వికల్ప యతి<br>యుక్త వికల్ప యతి<br>రేఫ యుత యతి<br>ప్రాది యతి<br>నిత్య సమాస యతి<br>నిత్య యతి<br>విభాగ యతి<br>ప్రభునామాంత యతి<br>కాకు స్వరయతి | ప్రాణివిరామము<br>వర్గ యతి<br>బిందు యతి<br>తద్భవవ్యాజ యతి<br>విశేష వళి<br>అనుస్వార సంబంధ యతి<br>అనునాసికాక్షర యతి<br>మువిభక్తి యతి<br>ముకార యతి<br>మవర్ణ విరామం<br>ఋజు యతి<br>ప్రత్యేక యతి<br>భిన్న యతి<br>ఏకతరయతి<br>అభేద విరతి<br>అభేద వర్గ యతి<br>ఊష్మ విశ్రాంతి<br>సరస వళి<br>సంయుక్త విశ్రామములు<br>అంత్యోష్మ సంధి వడి<br>వికల్ప విరమణము<br>యుష్మదస్మచ్ఛబ్దయతులు<br>పర రూప విరతులు<br>ప్రాది యతులు<br>నిత్య సమాస విశ్రాంతులు<br>(అఖండ యతి)<br>దేశ్య నిత్య సమాస విశ్రాంతులు<br>నిత్య యతులు<br>రాగమ సంధి వళులు<br>విభాగ వళులు<br>నామాఖండ విశ్రమము<br>పంచమీ విభక్తి విరామములు<br>కాకు స్వర వళులు<br>ప్లుతయుగ విశ్రామములు |

| | | |
|---|---|---|
| | | ప్రాస యతులు |

వ్యంజన యతులు-వర్ణమైత్రి:-

| | యతి పేరు | యతి మైత్రి ని పొందే అక్షరాలు |
|---|---|---|
| 1 | ప్రాణి విరామము | హల్లుకు యతి మైత్రి కూర్చునపుడు హల్లుకే కాకుండా, హల్లుతో పాటు ఉండే అచ్చుకు కూడయతిమైత్రి ఉండుట.<br>కకాకైకౌ<br>కికీకృకృకెకే<br>కుకూకొకో |
| 2 | వర్గ జయతులు | అనునాసికాక్షరాలు తప్ప ఆయా వర్గాలలోని నాలుగక్షరాలు ఒకదానితో ఒకటి యతి మైత్రిని పొందుట. కఖగఘ, చఛజఝ, టఠడఢ, తథదధ, పఫబభ |
| 3 | బిందు యతులు | బిందువుతో కలిసిన ఆయా వర్గాలలోని మొదటి నాలుగు వర్గాక్షరాలు ఆయా<br><br>వర్గానునాసికంతో యతి మైత్రిని పొందుతాయి. ంక,ంఖ,ంగ,ంఘ – ఙ, ఇట్లే<br><br>తక్కినవి |
| 4 | తద్భవ వ్యాజ విశ్రమము | ఙ కారంతో న, ణలు యతి చెల్లుట |
| 5 | విశేష వళి | ఙ కారంతో క,ఖ,గ,ఘ లు యతి చెల్లును |
| 6 | అనుస్వార సంబంధ యతి | ట వర్గ, త వర్గ ములోని వర్గానునాసికము తప్ప ఇతర వర్గాక్షరాలు అనుస్వార సంబంధం చేత పరస్పరం యతి మైత్రి చెల్లుతాయి<br>ంట, ంఠ, ండ, ంఢ<br>ంత, ంథ,ంద,ంధ } పరస్పరం యతిమైత్రిని పొందుతాయి |
| 7 | అనునాసికాక్షర యతి | బిందువుతో కూడిన ట వర్గాక్షరాలు న కారం తోను, బిందువుతో కూడిన త వర్గాక్షరాలు ణ కారంతో యతి మైత్రి పొందును.<br>ంట, ంఠ, ండ, ండ-న, ంత, ంథ, ంద, ంధ-ణ |
| 8 | మువిభక్తి యతి | విభక్తిగా వచ్చేటటువంటి 'ము' తో పు ఫు బు భు లకు యతిమైత్రిచెల్లుట. |
| 9 | ము కార యతి | సాధారణ ము వర్ణంతో పుఫు బు భు లకు యతి మైత్రి చెల్లుట |
| 10 | మవర్ణ విరామం | 'మ' అనే అక్షరంతో పూర్ణ బిందు పూర్వక యరలవశషసహలు యతి చెల్లుట<br>ంయ, ంర, ంల, ంవ, ంశ, ంష, ంస, ంహ-మ |
| 11 | ఋజు యతి | య-హ అనే అక్షరాలు పరస్పర యతిమైత్రిని చెందుట. |
| 12 | ప్రత్యేక యతి | అది, అవి శబ్దాలు పరమై సంధి జరిగినప్పుడు వ్యంజనమైత్రిని , సంధి జరుగనపుడు |

| | | |
|---|---|---|
| | | వచ్చే యడాగమానికి స్వరమైత్రిని చేయుట |
| 13 | భిన్న యతి | ఇంచుకాగమ రూపాల్లో స్వరమైత్రి, వ్యంజన మైత్రి రెండింటిలో ఏదైనా పాటించుట. ధరియించు-స్వరమైత్రి, ధరించు వ్యంజన మైత్రి |
| 14 | ఏకతర యతి | ర-ఱ లకు, ఱ-ఱ లకు యతి మైత్రి పాటించుట |
| 15 | అభేద విరతి | వ-బ, ల-డ, ల-ళ లకు యతి చెల్లుట |
| 16 | అభేద వర్గ యతి | పఫబభవ పరస్పరం యతిమైత్రి చెల్లుట |
| 17 | ఊష్మ విశ్రాంతి | శ ష స లు పరస్పరం యతిమైత్రి చెల్లుట |
| 18 | సరస వళి | అయహలు పరస్పరం యతి మైత్రి చెల్లుట చఛజఝశషస లు పరస్పరం యతి చెల్లుట. న-ణ లు ఒకదానితో ఒకటి యతి చెల్లుట |
| 19 | సంయుక్త విశ్రామము | సంయుకాక్షరాలతో ఏదైనా ఒక హల్లుకు మైత్రిని కూర్చుట. క్ష్మ=క+ష+మ ల సంయోగం. వీటిలో ఏ హల్లుకైనా యతిమైత్రి పాటించవచ్చు. |
| 20 | అంత్యోష్మ సంధివడి | వర్గానునాసికాలు తప్ప తక్కిన వర్గాక్షరాలకు 'హ' కారం పరమైతే పూర్వ సవర్ణాదేశం వికల్పంగా వస్తుంది. అటువంటి చోట హకారానికి గాని,ఆదేశ వర్ణానికి గాని యతి వేయుట  వాక్+హరి=వాగ్ఘరి, ఇందులో క,హలలో దేనికైనా యతి చేయవచ్చు. |
| 21 | వికల్ప విరమణము | అనునాసిక సంధి జరిగేటప్పుడు వర్గ తృతీయ వర్ణానికి గాని, ఆదేశ వర్ణానికి గాని యతి చెల్లుట. సత్+మతి=సన్మతి, ఇందులో త, న లలో దేనికైనా మైత్రి పాటింపవచ్చు. |

<u>ఉభయ వళులు:</u>

అచ్సంధి శబ్దాల్లోని పర స్వరానికి గాని, పూర్వ పదాంత వ్యంజనానికి గాని యతి మైత్రి చేయవచ్చు

| | | |
|---|---|---|
| 1. | యుష్మదస్మచ్ఛబ్ద యతి | యుష్మద్, అస్మద్ శబ్దాలకు స్వరము పరమై సంధి జరిగినపుడు పరపదాది స్వరమునకు గాని(అ,ఆ)  లకు పూర్వ పదాంత వ్యంజనమునకు గాని( ద,దా) లకు యతి పాటింప వచ్చు.<br>అస్మద్+అన్వయము=అస్మదన్వయము<br>యుస్మద్+ఆగమనము=యుష్మదాగమనము |

| | | |
|---|---|---|
| 2 | పర రూప విరతులు | శకం ధ్వాదుల వంటి పరరూప సంధి శబ్దాలలో ఉన్న అచ్చుకు గాని, హల్లుకు గాని యతి చెల్లును |
| 3 | ప్రాది యతి | ప్ర మొ॥ ఉపసర్గలకు అచ్చు పరమై సంధి జరిగినపుడు అచ్చుతో గాని హల్లుతో గాని మైత్రి చెల్లుట, |
| 4 | నిత్య సమాస విశ్రాంతులు (అఖండ యతి) | కర్ణాట, జనార్ధన నిత్యసమాసాల్లో రెండు శబ్దాలకు సంధి ఏర్పడినపుడుఅచ్చుతో గాని హల్లుతో గాని మైత్రి చెల్లుట, |
| 5 | దేశ్య నిత్య సమాస విశ్రాంతులు | రూపఱు, పెంపఱు, చూపఱు మున్నగు దేశ్య శబ్దాలలోని సంధ్యాక్షరానికి ఉభయయతి చెల్లుట |
| 6 | నిత్య యతులు | ఏని అనే పదం ఉత్తర పదంగా ఉండి నిత్య సంధి జరిగినప్పుడు అచ్చుతో గాని హల్లుతో గాని మైత్రిని పాటించుట |
| 7 | రాగమ సంధి వళులు | ఆలు శబ్దం పరమై ఏర్పడే రుగాగమ సంధిలో అచ్చుతో గాని హల్లుతో గాని మైత్రి పాటింప వచ్చును |
| 8 | విభాగ వళులు | సంఖ్యా వాచకాలకు, పరిమాణ వాచకాలకు (దోసెడు-మోపెడు మొ॥) విభాగార్థాలను సూచించే ఏసి, ఎడు అనునవి సంధిలో వచ్చి చేరినప్పుడుఅచ్చుతో గాని హల్లుతో గాని మైత్రి చెల్లుట |
| 9 | నామఖండ విశ్రమములు | శ్రేష్ఠతా వాచకాలైన అన్న, అప్ప, అయ్య మొ॥ పరమై నిత్య సంధి జరిగినప్పుడు వాటికి అచ్చుతో గాని హల్లుతో గాని యతిమైత్రి పాటించుట |
| 10 | పంచమీ విభక్తి విరమము | పరపదాలుగా పంచమీ విభక్తి ప్రత్యయాలైన కన్నన్, కంటెన్ ప్రత్యయాలు వచ్చి చేరినప్పుడు అచ్చుతో గాని, హల్లుతో గాని యతిమైత్రి పాటించుట |
| 11 | కాకుస్వర వళులు | ప్లుతోచ్చారణ గల కాకు స్వరాలకు ఉభయయతి చెల్లును |
| 12 | ప్లుత యుగ విశ్రమములు | హల్లులు పరస్పరం భిన్నమైనప్పటికి పాదాదియందును యతిస్థానమందును ప్లుతములున్నచో |

| | | |
|---|---|---|
| | | వాటికి యతిమైత్రి చెల్లును ఇందులో స్వర మైత్రికే కాని వ్యంజన మైత్రికి అవకాశం లేదు |
| ప్రాసయతులు: యతికి మారుగా ప్రాసాక్షరంతో యతిమైత్రిని పాటించడమే ప్రాసయతి | | |

భీమన పేర్కొన్న 6 వ్యంజనయతులతో పాటు అనంతుడు మరొ 7 యతులను చేర్చాడు.'జ' కారానికి 'జ' కారా మిత్రాలైన వర్ణాలతో తొలుత యతి మైత్రి పాటింపబడేది. కాని తరువాతి కాలంలో 'జ్ఞ'కు న, ణ ల ఉచ్ఛారణకు సాదృశ్యం కలగడం వలనే అనంతుడు ఈ యతిని చెప్పవలసి వచ్చి ఉండవచ్చు. "జ్ఞ-న,ణ'' ల కు యతిమైత్రిని కవిత్రయం వారు పాటించలేదు. అట్లే పూర్ణ బిందు పూర్వక య,ర,ల,వ,శ,ష,స,హ లకు మకారంతో ఉచ్ఛారణలో సాదృశ్యం ఉండడంతో 'మ' కార యతి ని అనంతుడు చెప్పవలసి వచ్చింది. ఇటువంటి సాదృశ్యములు అనంతుని కాలంలో ఏర్పడి ఉండవచ్చు.

భీమన చెప్పిన 10 యతులను అప్పకవి చెప్పాడు కాని అందు 'ఎక్కటి యతి' ని 'ఏకతర యతి' అని 'పోలిక యతి ని' 'మువిభక్తి యతి' అని పేర్కొన్నాడు. పేరులో మాత్రమే మార్పు కాని లక్షణం ఒకటే. పు-ఫు-బు-భు లకు 'ము' తో పోలిక ఉండడం చేత భీమన, అనంతుడు వీటి మైత్రిని 'పోలికవడి' అని పేర్కొన్నారు. విభక్తి 'ము' కారానికి చెప్పబడే యతి కాబట్టి అప్పకవి 'ము' విభక్తి యతి అని పేర్కొన్నాడు. 'పోలిక వడి' అన్న పేరుకంటే'మువిభక్తి' యతి అన్న పేరు సమంజసంగా ఉంది. అనంతుడు చెప్పిన వ్యంజనయతులలో 'రేఫయుతయతి' ని తప్ప తక్కిన యతులన్నింటిని అప్పకవి పేర్కొన్నాడు. కాని కొన్ని వ్యత్యాసాలున్నాయి. 'మకార యతిని' అప్పకవి 'మవర్ణవిరామమని', 'వికల్ప యతి' ని 'అంత్యోష్మ సంది వడి' అని 'ముక్త వికల్ప యతి'ని 'వికల్ప యతి' అని మార్చాడు. అనంతుడి 'మ' కార యతి, అప్పకవి 'మువర్ణ విరామము'లు పేర్లు సమానార్థాలైనట్లే లక్షణం కూడా సమానం. అనంతుడు వికల్ప సంధి వశంలో వచ్చు రూపం కావున 'వికల్ప యతి' అని పేరు పెట్టగా అప్ప కవి సంధి వశంతో వచ్చు అంత్యోష్మమైన 'హ' కారానికి యతి చెల్లుతుంది. కాబట్టి అంత్యోష్మ సంధి వడి అని పేర్కొన్నాడు. ఈ రెండు పేర్లు సమంజసంగానే ఉంది. అనంతుడి 'ముక్త వికల్ప యతి' ని అప్పకవి 'వికల్ప విరమణం' అని పేర్కొన్నాడు. రెండింటిలోనూ లక్షణం ఒకటే.

అనంతుడు చెప్పని 'ప్రాణి యతి', 'విశేషవళి' అనుస్వార సంబంధ యతి, అనునాసికాక్షర యతి, ముకార యతి, ఋజుయతి, ప్రత్యేక యతి, అభేద వర్గ యతి, ఊష్మ విశ్రాంతి లను అప్పకవి చెప్పాడు. అప్పకవి ప్రాణి యతిని చెప్పడానికి కారణం యతిమైత్రికి స్వర మైత్రి ప్రధానం. స్వరమైత్రిననుసరించే వ్యంజనమైత్రి పాటింపబడుతుంది. కాబట్టి ఈ ప్రాణి యతి అవసరం. అనంతుడికి పూర్వుడైన 'తిక్కన' విశేషవళిని పాటించినప్పటికి అనంతుడు కాకుండా అప్పకవి దీన్ని గుర్తించి చెప్పడం ప్రశంసించదగిన విషయం.

అనుస్వార సంబంధయతిని అనంతునికి పూర్వం ఎవ్వరు ప్రయోగించలేదని తెలుస్తోంది. అనునాసికాక్షర యతిని తిక్కన ఒక్క చోట మాత్రమే ప్రయోగించడం, అనంతునికి పూర్వులు ఈ యతిని ప్రయోగించకపోవడం చేతఅనంతుడు ఈ రెండింటిని చెప్పి ఉండక పోవచ్చు.అప్పకవి ఈ రెండింటిని వేరువేరుగా కాక ఒకే యతిగా చెప్పి ఉండవచ్చు.

అనంతుని కాలం వరకు విభక్తి గతమైన 'ము' కారానికే' పు,ఫు,భు,బు లు యతి చెల్లేది కాని అప్పకవికాలం నాటికి సహజ 'ము' కారానికి పు,ఫు,బు,భు లు యతిమైత్రి పొందడం చేత అప్పకవి ఈ ముకార యతిని అదనంగా చెప్పి ఉంటాడు. కాని దీన్ని కూడా 'మువిభక్తి యతి' లోనే చేర్చి ఉండొచ్చు. భీమన, అనంతుడు చెప్పినట్లే అప్పకవి సరస యతిలో 'అ-య-హ' లకు 'శ,ష,స-చ,ఛ,జ, ఝ' లకు యతి మైత్రి చెప్పినప్పటికి 'ఋజుయతి' లో 'య-హ' ల కు, ఊష్మ విశ్రాంతి లో 'శ,స,ష' లకు ప్రత్యేకంగా చెప్పడం కేవలం స్పష్ట ప్రతిపత్తి కొరకే అయి ఉంటుంది. అనంతుని భిన్న యతిలో పేర్కొన్న లక్ష్యాలలో ఒకటైన 'చేతిది' రూపాన్ని గ్రహించి అప్పకవి 'ప్రత్యేక యతిగా' చెప్పడంజరిగింది. చేతి+అది=చేతిది . 'చేతిది' అనే రూపంలో పరరూప సంధి జరిగితే చేతది అని, సంధి జరగనప్పుడు యడాగమం వచ్చి 'చేతయది' అని ఏర్పడాలి. కాని ఇక్కడ 'అ'కారానికి ముందు, వెనుకలు 'ఇ' కారంతో కూడిన

వ్యంజనాలుండడం చేత వాటి ప్రభావం వల్ల 'అ' కారానికి లోపం వచ్చి చేతిది అనే అసాధారణమైన రూపం ఏర్పడి నిత్య సంధి లా భాసించింది. ఇట్టి పదాలు యతి స్థానంలో వచ్చినప్పుడుసంధి గతమైన పదంలోని హల్లుకే యతిమైత్రి చెప్పాలని అప్పకవి అభిమతం. అందుకే ప్రత్యేకంగా అప్పకవి ఈ యతిని పేర్కొన్నాడు. అభేద యతిలో 'ప,వ' లకు యతి అనంతుడు చెప్పాడు. అప్పకవి కాలం నాటికి 'వ' కారానికి 'ఫ,భ,బ' లతో కూడా ఉచ్చారణ సాదృశ్యం కలిగియతిమైత్రి పాటింప బడింది. కాబట్టి కాలానుగుణంగా భాషలో ఏర్పడిన మార్పులను గుర్తించి వాటిని చెప్పడం జరిగింది.

స్వర సంధి వశంలో కూడిన పదాల్లో స్వర ప్రధాన వడిననుసరించి పరమైన స్వరానికి గాని, లేక పర స్వరంతో కూడిన పూర్వ పదాంత వ్యంజనానికి గాని మైత్రి పాటించడమే ఉభయవళులుగా పేర్కొనబడ్డాయి. ఉభయవళుల క్రింద పేర్కొన బడ్డ యతుల్ని పరిశీలిస్తే సంధి వశంలో కూడిన పదాలు విడదీయడానికి వీలులేని విధంగా కలిసి పోయి ఏక పదంలా కనిపిస్తాయి.ఈ కారణం చేత పెక్కురు పండితులు ప్రధానంగా ఉన్న హల్లు కే యతి మైత్రి ని పాటించారు. కానీ కొందరు పండితులు అవి సంధి వశంలో కూడిన పదాలని, వాటిని విడదీయవచ్చని గుర్తించి విడదీసిపరాచ్చుకు యతి పాటించారు. ఈ విధానం వల్ల రెండూ గ్రాహ్యాలే అన్న విషయాన్ని ఉభయ వళుల క్రింద లాక్షణికులు చెప్పారు.

ఇక ఉభయ యతులను పరిశీలిస్తే భీమన ప్రాది వడి, ప్లుత వడి, అఖండవడి అనే 3 యతుల్ని చెప్పగా అనంతుడు వాటితో పాటు నిత్య సమాస యతి, నిత్యయతి, విభాగ వడి, ప్రభునామాంత యతి, కాకుస్వర వడి అనే యతులను చేర్చెను. భీమన పేర్కొన్న 'అఖండవడి' ని అనంతుడు నిత్య సమాస యతిగా చెప్పాడు. అప్పకవి ఈ యతిని చెప్పకపోవడానికి కారణం అతడికి ఈ యతి సమ్మతం కాదని భావించవచ్చు. అఖండవడి ని సమ్మతిస్తే వ్యంజనాన్ని ప్రధానంగా గ్రహించి యతిమైత్రి పాటించాలి. "రాముఁడతడు (డ), వంశాబ్ధి(శ)" ఇత్యాది తెలుగు సంస్కృత సందులందెల్ల వ్యంజన మైత్రినంగీకర్తవ్యమేయగును. ఇది యంత రమ్యముగా దోపదు. ఇట్టి యతి చారాతి వ్యాప్తులనరికట్టి కతిపయ శబ్దములందే దీని బరిమితము చేయదలచి యుభయయతి భేదములనంతాదులచే జెప్పబడెను"అని రావూరిలి గారు పేర్కొన్నట్లు అఖండ వడిని పేర్కొన్న పెక్కురులాక్షణికులు 'ఉబయవళు'లను కూడా పేర్కొన్నారు. వారందరికి అఖండ వడి, ఉభయవళులు రెండునూ సమ్మతమే కాని అప్పకవికి ఇది సమ్మతం కాదు. అఖండ వడిని సమ్మతిస్తే సంధి వశంలో కూడిన పదాలు ఏక పదాలవలే గోచరిస్తాయి. కొందరు సంధి జరగినట్లు కూడా గుర్తించక పోయే ప్రమాదం ఉంది.

అప్పకవి అనంతుడు పేర్కొన్న ఉభయ యతులన్నింటిని పేర్కొన్నాడు. అనంతుడు పేర్కొన్న 'ప్రభునామాంతర యతి' ని అప్పకవి 'నామఖండ యతి' అని పేరు మార్పుతో సూచించాడు.లక్షణపరంగా ఈ రెండిటికి అంత బేధం లేదని చెప్పవచ్చు. పరరూప యతి లో 'శఖందు', 'కర్కంధు' మొ॥సంస్కృత శబ్దాలు సంధిలో వచ్చినప్పుడు సవర్ణదీర్ఘ సంధుల ప్రకారం దీర్ఘం వచ్చి 'శకాంధు', 'కర్కాంధు' అను రూపాలు రావలసి ఉండగా, అలా ఏర్పడక తెలుగు సంధి ప్రకారం ఒక అచ్చుకు లోపం జరిగింది.

లి రావూరి దొరస్వామి శర్మ "తెలుగు భాషలో ఛందోరీతులు" పు.సం;300

ఈ విధంగా సంస్కృత శబ్దాలకు పరభాషా ప్రభావం వల్ల వేరు రూపం సిద్ధించడం చేత వీటిని 'పరరూప విరతులు' అని ప్రత్యేక యతిగాచెప్పడం జరిగింది. 'ప్రాది యతులందు' ఉదహరించిన శబ్దాలన్నీ 'పద ప్రత్యయముల' కలయిక వల్ల ఏర్పడ్డవి. తెలుగు భాష లో పదానికి ముందు ప్రత్యయాలు చేరిన రూపాలు ఉండడం అరుదు. కాని సంస్కృత భాషలో పదానికి ముందు ప్రత్యయాలు చేరుతుంటాయి. అట్టి పదాలు తెలుగు భాషలో చేరడం వల్ల పలువురు వీటిని ఏక పదాలని భావించారు. కాబట్టే ఆ శబ్దాలను విడిగా 'ప్రాదియతి' లో పేర్కొన వలసి వచ్చింది. సంధి వశంలో కూడిన సమాసాలు కొన్ని ఉన్నాయి. అట్టి సమాసాలు ఏకపదంగా అనిపించడం చేత ఆ పదాలు యతి స్థానంలో వచ్చినప్పుడు వాటిని విడదీయ వచ్చునని, స్వర వ్యంజనాలలో దేనికైనా మైత్రి

పాటింపవచ్చునని 'నిత్యసమాస విశ్రాంతులు', 'దేశ్యనిత్య సమాస విశ్రాంతులు' అను రెండు యతుల్లో చెప్పబడింది. వీటిని విడివిడిగా చెప్పడానికి కారణం మొదటి దాంట్లో సంస్కృత శబ్దాల నిత్య సమాసాలు, రెండవ దాంట్లో దేశ్య శబ్దాలకు (రూపఱు, పెంపఱుమొ॥) ఏర్పడ్డ నిత్యసమాసాలకు యతిమైత్రి చెప్పబడింది. భాషల్ని అనుసరించి స్పష్టత కోసం అప్పకవి ఇలా విడివిడిగా చెప్పాడు కాని రెండింటిని కలిపి ఒకే యతిగా చెప్పి ఉండవచ్చు. నిత్య యతులందు అప్యర్థకమైన 'ఏని' శబ్దం పరమై సంధి జరిగినప్పుడు 'రాగమ సంధి వళు' లందు ఆలు శబ్దం పరమై రేఫాగమము వచ్చి సంధి జరిగినప్పుడు, 'విభాగ వళులందు' ఏసి ఎడు అనే శబ్దాలు పరమై సంధి జరిగినప్పుడు 'నామాఖండ' విశ్రమము' లో అమ్మ, అయ్య, అప్ప, అన్న మొ॥ శబ్దాలు పరమై సంధి జరిగినప్పుడు, 'పంచమి విభక్తి విరామము' నందు 'కన్నన్', 'కంటెన్' అనే ప్రత్యయాలు పరమై సంధి జరిగినప్పుడు ఏక పదాల వలే కలిసిపోయే అవకాశముంది. అట్టి పదాలను విడదీసి స్వర, వ్యంజన మైత్రుల్లో దేనికైనా యతి చెల్లింప వచ్చని చెప్పడం జరిగింది. పై యతులన్నింటిలో పరమైన రూపాలతో నిత్య సంధి జరిగి పదాలు ఏకమైనప్పటికి అవి పరమైన సందర్భాలు వేరు వేరగుటచే వాటిని వేరువేరు యతులుగా చెప్పవలసి వచ్చి ఉంటుంది. కాకు స్వర యతిలో ప్లుత వర్ణానికి అచ్చుతో గాని, హల్లుతో గాని యతి చెల్లునని. 'ప్లుత యుగ విశ్రాంతు' లందు ప్లుతానికి ప్లుతానికి మధ్య హల్మైత్రి అవసరం లేకుండానే మైత్రిని పాటించవచ్చని చెప్పబడింది. ఉభయ వళుల లక్షణం అచ్చుకుగాని, హల్లుకు గాని యతిమైత్రి పాటింపవచ్చుననుట. కానీ ఈ 'ప్లుతయుగ విశ్రామము' తో స్వరానికే యతిమైత్రి పాటించాలని చెప్పబడడంతో ఇది ఉభయ వళుల్లో చేరే అవకాశం లేదు కదా!

గీత, సీస పద్యాల్లో ప్రాస నియమం లేదు కాబట్టి 'ప్రాసయతి' చెప్పబడింది. ప్రాసయతిలో ప్రాసలక్షణమే ఉంటుంది. అనగా వ్యంజన మైత్రి తప్ప స్వరమైత్రి ఉండదు. లక్షణం ప్రాసను పోలి ఉన్నప్పటికి యతికార్యాన్ని నిర్వహిస్తోంది. కాబట్టి దీన్ని యతిగానే పరిగణించవచ్చు.

ప్రాస

ఇక ప్రాస విషయానికొస్తే ప్రాసమైత్రి సంస్కృత భాషలో లేదని చెప్పవచ్చు. సంస్కృతంలో అనుప్రాసలు ఉన్నాయి. అవి పాద మధ్యం లో పాదాంతంలోఉంటాయి. కాని వాటిని సంస్కృతంలోనూ , తెలుగు లోనూ శబ్దాలంకారాలుగానే పరిగణింపబడ్డాయి. 'ప్రాస' శబ్దము సంస్కృతమే కాని లక్షణం మాత్రం దేశీయమే. 'యతిమైత్రి' లా ప్రాసమైత్రి కూడా సామెతల్లో, గేయవాఙ్మయంలో ప్రాచీన కాలం నుండి ఉంది. వర్ణమైత్రి కలిగించే లయ ఏ పాదానికి ఆ పాదం విడివిడిగా ఉంటుంది కాని ప్రాసమైత్రి ఆపాదించే లయ నాలుగు పాదాలకు ఒకే విధంగా ఉంటుంది. అయితే ఈ ప్రాస మైత్రి పాదాల్లోని ద్విత్వాక్షరాలకే కలగడానికి కారణం కొన్ని పద్యాల్లో (సీసము, గీతము) యతిమైత్రి ని పాటించడానికి బదులు ప్రాసయతి పాటింపబడింది. యతిస్థానంలో తరువాతి అక్షరాలకు ప్రాస యతి చెప్పబడింది. అనగా పాద ద్వితీయాక్షరానికి పద్య నియమానుసారం పాదమధ్యంలో చెప్పబడే యతిస్థానానికి తరువాత నున్న అక్షరానికి చెప్పబడింది.ఈ విధానం వల్ల పాద యతుల్లాగా ఉచ్ఛారణ సాదృశ్యంగల ఇతర వర్ణాలతో మైత్రి చెప్పబడక ఏ వర్ణానికి ఆ వర్ణమే ప్రాసయందు మైత్రి పాటింపబడింది. ఈ విధానం కూడా లయకు రమ్యత్వాన్ని ఆపాదించడానికి తోడ్పడుతుంది.

ప్రాసల పట్టిక

| అనంతుడు పేర్కొన్న ప్రాసలు | అప్పకవి పేర్కొన్న ప్రాసలు |
|---|---|
| సమ ప్రాస<br><br>ప్రాసమైత్రి ప్రాస | అర్ధ బిందు సమ ప్రాసము<br><br>పూర్ణ బిందు సమ ప్రాసము |

| | |
|---|---|
| ఋ ప్రాస<br><br>త్రి ప్రాస<br><br>ప్రాది ప్రాస<br><br>సమలఘు ప్రాస<br><br>వికల్ప ప్రాస<br><br>బిందు ప్రాస<br><br>అర్ధ బిందు ప్రాస<br><br>ఉభయ ప్రాస<br><br>సంయుత ప్రాస<br><br>సంధిగత ప్రాస | ఖండాఖండ ప్రాసము<br><br>సంయుతాక్షర ప్రాసము<br><br>సంయుతాసంయుత ప్రాసము<br><br>రేఫయుత ప్రాసము<br><br>లఘు ద్విత్వ ప్రాసము<br><br>వికల్ప ప్రాసము<br><br>ఉభయ ప్రాసము<br><br>అనునాసిక ప్రాసము<br><br>ప్రాసమైత్రి ప్రాసము<br><br>ప్రాస వైరము<br><br>స్వవర్గజ ప్రాసము<br><br>ఋ ప్రాసము<br><br>లఘు యకార ప్రాసము<br><br>అభేద ప్రాసము<br><br>సంధిగత ప్రాసము |

ప్రాస భేదాలు-వాటి మైత్రి :-

| | ప్రాస నామము | ప్రాస మైత్రిని పొందునవి |
|---|---|---|
| 1 | అర్ధ బిందు సమప్రాసము | అర సున్నా కి అర సున్నా కి ప్రాస మైత్రిని కూర్చుట<br>(వీ ( క-తా ( కి) |
| 2 | పూర్ణ బింధు సమప్రాసము | పూర్ణ బిందువుకి(0) పూర్ణ బింధువుతో ప్రాస మైత్రిని ఏర్పరచుట.<br>(పొంది, బ్రుందా, ఇందీ నంద) |
| 3 | ఖండాఖండ సమప్రాసము | అర సున్న పూర్వమందు గల అక్షరాలకు, అరసున్న పూర్వము లేని అక్షరాలకు |

| | | |
|---|---|---|
| | | ప్రాస మైత్రిని కూర్చుట, హల్మైత్రి యధాతథం (బో(టి- పాట)(తీ(గ-నాగ) |
| 4 | సంయుతాక్షర సమప్రాసము | ప్రాసాక్షరము సంయుక్తాక్షరమైనప్పుడు అన్ని పాదాల్లోని ప్రాస స్థానంలో అట్టి సంయుక్తాక్షరమే ఉంటుంది<br>(గర్గ-బర్గ) (చంద్ర-వేంద్ర) |
| 5 | సంయుతాసంయుత ప్రాసము | ర,ల,లు మరో అక్షరంతో కలిసి సంయుక్తంగా ప్రాస స్థానంలో ప్రయోగించిప్పుడు వాటికి మైత్రి అసంయుక్తాలైన ర లతో చెల్లుతుంది |
| 6 | రేఫయుత ప్రాసము | వట్రుసుడితో (ృ) కూడిన హల్లులు (కృ-గృ మొ॥)<br>ఉకారము, రేఫము గల హల్లులు (క్రు-ద్రు మొ॥)<br>ఒకదానితో ఒకటి మైత్రిని పొందక వేటికవి మైత్రిని పొందడమే రేఫయుత ప్రాస. |
| 7 | లఘు ద్విత్వ ప్రాసము | అద్రుచు, విద్రుచు మొ॥ పదాలలోని రేఫ తేల్చి పలుకబడుతుంది. ఇటువంటి రేఫ(లఘు) ప్రాస స్థానమున ఉన్నప్పుడు వాటికి లఘు రేఫతోనే ప్రాస మైత్రి పాటింపబడును. |
| 8 | వికల్ప ప్రాసము | వికల్ప సంధ్యాక్షరానికి అనునాసికాలతో గాని వర్గ తృతీయ అక్షరాలతో గాని ప్రాస మైత్రి పాటింపబడును. |
| 9 | ఉభయ ప్రాసము | ఆదేశ 'ష' కారానికి సహస 'ష' కార 'స' కార ల తోను,<br>ఆదేశ 'ణ' కారం, సహజ ణ కార నకారాలతోను ప్రాస మైత్రిని పొందును. |
| 10 | అనునాసిక ప్రాసము | ద్విత్వ 'న' కార, 'మ' కార లు(న్న, మ్మ)। పూర్ణ బిందు పూర్వకాలైన 'న' కార 'మ'కారాలతో (ంన, ంమ) ప్రాస మైత్రిని పొందును. |
| 11 | ప్రాస మైత్రి ప్రాసము | పూర్ణ బిందు పూర్వక 'బ' కారానికి (ంబ) ద్విత్వ 'మ' కారంతో (మ్మ) ప్రాస మైత్రి చెల్లును. |
| 12 | ప్రాస వైరము | శకట రేఫకు (ఱ) సాధు రేఫకు (ర) ప్రాస మైత్రిని పాటించరాదు. |
| 13 | స్వవర్గజ ప్రాస | థ-ధ లకు; ద-ధ లకు ప్రాసమైత్రి పాటించుట |
| 14 | ఋ ప్రాసము | ఋ కు రేఫతో (ర) ప్రాసమైత్రి పాటించుట. |
| 15 | లఘు యకార ప్రాసము | సహజ య(అలఘు య కారం) కారానికి- ఆగమ య కారానికి(లఘు యకారం) ప్రాస మైత్రిని కూర్చుట |
| 16 | అభేద ప్రాసము | ల-ళ డలు పరస్పరం ప్రాస మైత్రిని కలిగి ఉండుట |
| 17 | సంధిగత ప్రాసము | సంధి జరిగి ఆదేశంగా వచ్చిన హల్లుకు సహజ హల్లుకు ప్రాసమైత్రి చెల్లుట |

అనంతుడు, అప్పకవి చెప్పిన ప్రాసల్లో పేర్లు, లక్షణాలు రెండు సమానమైనవి- 'ఋ ప్రాసము' 'వికల్ప ప్రాసము', 'సందిగత ప్రాసము' లు. లక్షణం ఒకటే అయినప్పటికి వేరు వేరు పేర్లతో సూచింపబడిన ప్రాసలు కొన్ని ఉన్నాయి. అవి అనంతుడు పేర్కొన్న 'సమలఘు ప్రాస' ను అప్పకవి 'లఘు ద్విత్వ ప్రాస' అను పేరుతొ పేర్కొన్నాడు. అద్రుచు, విద్రుచు మొ॥ శబ్దాలలో రేఫతో కూడిన సంయుక్తాక్షరానికి పూర్వమున్న హ్రస్వాన్ని తేల్చి పలకడం వల్ల అవి లఘువులవుతాయి. కాబట్టి అట్టి సంయుక్తాక్షరాన్ని ప్రాసలో మొదటి పాదంలో కూర్చినట్లైతే తక్కిన పాదాలందు అదే విధానాన్ని సమంగా పాటించాలి. అందుచేత అనంతుడు ఈ ప్రాసని 'సమ లఘు ప్రాస' అని పేర్కొన్నాడు. ద్విత్వమైనప్పటికి పూర్వ వర్ణానికి లఘుత్వాన్ని కలిగించుట చేత 'లఘు ద్విత్వ ప్రాస' అని అప్ప కవి దీనికి పేరు పెట్టెను. ఆలోచిస్తే ఈ పేర్లు రెండు సమంజసంగానే ఉన్నాయి.

అనంతుడు 'సమప్రాసము' లో ప్రాస స్ధానములో అర్ధ బిందువు, పూర్ణ బిందువు, సంయుక్త వర్ణాలలో ఏదుంటే ఆ పద్యమందలి తక్కిన ప్రాస స్థానాల్లోనూ అవే ఉన్నట్లైతే అవి 'సమప్రాసము' లవుతాయి అని చెప్పాడు. మూడింటికి కలిపి పేర్కొన్న ఈ ప్రాసను అప్పకవి విడి విడిగా 'అర్ధ బిందు సమ ప్రాసము', పూర్ణ బిందు సమప్రాసము', 'సంయుతాక్షర ప్రాసము' అని చెప్పుట కేవలం స్పష్టత కొరకే నని తెలుస్తోంది. అనంతుడు అర్ధబిందు ప్రాసలో 'ప,ట' అనే రెండు వర్ణాలకే ప్రాస మైత్రి (అర్ధ బిందువు ఉన్న వర్ణానికి లేని వర్ణానికి) చెప్పగా అప్పకవి పరుషాలన్నిటికి (కచటతప) ఈ ప్రాసమైత్రి ని చెప్పాడు. లక్షణంలో చెప్పక పోయినా సరళాలకు ఉదాహరణలు చూపాడు. అనంతుడు 'అర్ధబిందు ' వనేపేరు వాడగా అప్పకవి 'ఖండ, అఖండ' అనే పేర్లను వాడాడు.

అనంతుడు 'ప్రాసమైత్రి ప్రాస' లో 'ల-ళ' లకు పూర్ణ బిందు పూర్వక 'బ-మ' లకు ప్రాసమైత్రి చెప్పాడు. కాని అప్పకవి 'ల-ళ' ల మైత్రి ని 'అభేదప్రాస' లోను , పూర్ణ బిందు పూర్వక బ-మ (ంబ-ంమ) లకు మైత్రిని 'ప్రాస మైత్రి ప్రాస' లోను చెప్పాడు. అనంతుడు త్రిప్రాసము, ఉభయప్రాసము అనే రెండు ప్రాసల్లో పేర్కొన్న లక్షణాన్ని అప్పకవి 'సంయుతాసంయుత ప్రాస' లోనే చేర్చి చెప్పాడు. అంతేగాక అనంతుడు 'సంయుత ప్రాస' లో వట్రువుకి, క్రావడికి ప్రాసమైత్రి చేయరాదని, వేటికవే మైత్రి చెల్లుతుందని సూచనగా చెప్పిన విషయాన్ని 'రేఫయుత ప్రాస' అని ప్రత్యేక ప్రాస బేధంగా చెప్పాడు. అనంతుడు ప్రాదిప్రాసలో 'న-ణ' లకు మాత్రమే మైత్రి చెప్పగా అప్పకవి 'ఉభయ ప్రాసమను' పేర 'న-ణ' లతో పాటు ఆదేశ షకారానికి సహజ 'ష' కార స కారాలు, ఆదే శ 'ణ' కారానికి సహస 'ణ' కార, 'న' కారాలు మైత్రి పొందుతాయని చెప్పాడు. అనంతుని కాలంలో 'న-ణ' లకే ఉచ్చారణలో సాదృశ్యమేర్పడగా అప్పకవి కాలం నాటికా 'ష-స' లకు కూడా సాదృశ్యమేర్పడిందని తెలుసోంది.అనంతుడు చెప్పినబిందు ప్రాస లోని లక్షణాన్ని అప్పకవి సంధిగత ప్రాసలో సూచించాడు.

అనంతుడు చెప్పని 'అనునాసిక ప్రాస', 'ప్రాస వైరము','స్వవర్గజ ప్రాస', 'లఘు యకార ప్రాస' అను నాలుగు ప్రాసలను అప్పకవి అదనంగా చెప్పాడు. స్వవర్గజ ప్రాసలో థ,ధ,ద, లకు అప్పకవి ప్రాసమైత్రిని చెప్పాడు. వీటి ఉచ్చారణలో సాదృశ్యం (రూప సాదృశ్యం కూడా) అధికంగాకనబడుతుంది. ప్రాసమైత్రి లో ఆయా వర్ణాలకే మైత్రి చెల్లుతుండగా ఈ 'త' వర్గానికి మాత్రం థ,ద,ధ మూడింటికి మైత్రి పాటింపబడుతుంది. ఈ మైత్రి కవిత్రయ కాలం నుండే కనబడుతుంది. కనుక ఈ ప్రాసమైత్రి అవసరమే. 'లఘు య కార' ప్రాసలో సహజ 'య' కారానికి , సిద్ద 'య' కారానికి ఉచ్చారణ సాదృశ్యాన్ననుసరించి మైత్రి పాటింపబడింది.

యతి భేదాల వలే ప్రాస భేదాలు కలగకపోవడానికి కారణం ప్రాసమైత్రి లో స్వరమైత్రి పాటింపక పోవడం, ప్రాసాక్షరం పై

ఊనిక లేక పోవడం అని చెప్పవచ్చు.

శబ్దాలంకార ప్రాసలు:

భీమన చంధ: ప్రకరణలోని ప్రాస విభాగములో షడ్విధ ప్రాసలు పేర్కొనెను. అప్పకవి వాటితో పాటు చతుష్ప్రాసమును అదనంగా చేర్చి ఏడు ప్రాసలను శబ్దాలంకార ప్రాసలంటూ పేర్కొన్నాడు. కాని నిజానికి అనుప్రాసము ఒక్కటే అలంకార శాస్త్రంలో చేర్చదగినది.

| | ప్రాస పేరు | లక్షణం |
|---|---|---|
| 1 | సుకర ప్రాసము | త,ద,న,మ,య,ర,ల,వ,స మొ॥ సులభమైన అక్షరాలకు ప్రాసమైత్రి చెల్లుట |
| 2 | దుష్కర ప్రాసము | ష్క, జ్ఞ,స్త్ర, :క మొ॥ సంయుక్తాక్షరాలకు, విసర్గ పూర్వక అక్షరాలకు ప్రాస మైత్రిని కూర్చుట |
| 3 | ద్వంద్వ ప్రాసము | అన్ని పాదాల్లోని 2,3 అక్షరాలు సమంగా ఉండే ప్రాస |
| 4 | త్ర్యక్షర ప్రాసము | అన్ని పాదాల్లోని 2,3,4 అక్షరాలు సమంగా ఉండే ప్రాస |
| 5 | చతుష్ప్రాసము | అన్ని పాదాల్లోని 2,3,4,5 అక్షరాలు సమంగా ఉండే ప్రాస |
| 6 | అంత్య ప్రాస | అన్ని పాదాల్లోని చివరి అక్షరాలు సమంగా ఉండే ప్రాస |
| 7 | అనుప్రాసము | ప్రాసాక్షరం పద్యంలో అనేక సార్లు వచ్చుట |

యతి ప్రాసల మైత్రికి ప్రధాన కారణం ఉచ్చారణ సామ్యం. ఉచ్చారణ కాలానుగుణంగా మార్పు చెందే అవకాశం ఉంది. ఇతర భాషా ప్రభావాలు, మాండలిక భేదాలు ఈ మార్పులకు కారణమవుతాయి. ఆ ప్రభావం కవుల రచనలపైపడుతంది. కవుల

రచనలననుసరించే లక్షణ గ్రంధాలు వ్రాయబడతాయి కాబట్టి లక్షణ గ్రంధాల్లోనూ ఆ భేదాలు ఏర్పడే అవకాశం ఉంది.

పూర్వ లాక్షణికులు పలువురు యతిప్రాసలను స్థూలంగా కొన్ని విభజనలు చేసి వాటిలో కొన్ని అంతర్విభాగాలు ఏర్పరచారు. కాని తరువాతి లాక్షణికులు కొందరు కొన్ని అంతర్విభాగాలను కూడా ప్రత్యేక యతులుగా పేర్కొంటూ వాటి సంఖ్యను పెంచుతూ వచ్చారు. ఇందరు లాక్షణికులు ఇన్ని యతిప్రాసలు పేర్కొన్నప్పటికి వీరు గుర్తించని యతిప్రాసలెన్నో ఉన్నాయి. ఆధునిక కాలంలో పండితులు కొందరు వాటిని కనుగొని తమ వ్యాసాల్లో సూచించారు. కాని వాటిపై విస్తృత పరిశోధన చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

# అప్పకవీయం లోని యతి ప్రాసలు-సమీక్ష

Paper Presented by:
Dr.G.Jhansi Vani
HOD, Department of Telugu
BCAS-Bapatla
Guntur District-522101